పించింది. ఇల్లూ, ఆఫీసూ, చాకిరీ, ఈ మూడు మాటలు దెయ్యాలలాగా తనచుట్టూ తిరుగుతున్నట్టు వెంకటరావుకి తోచింది. ఈ మాటలు తన జీవితంచుట్టూ ఎన్నో వలయాలను గిర్రున త్రిప్పుతున్నాయి. అన్నింటికంటె దగ్గరగావున్న వలయం క్షణక్షణానికి బిగుసుకొంటున్నది. ఒక రోజు తనని నొక్కి నులిమివేస్తుంది. వెంకటరావు బస్సు పై అంతస్థునుంచి నగరాన్ని కలయజూచినట్లు, తన జీవితాన్ని తరిచి చూచుకున్నాడు. అతనికి, తన జీవితం బట్టబయలై కనపడింది. మూడు మాటల్లో అతని జీవితం ఇమిడింది. ఇల్లూ... ఆఫీసు...చాకిరీ...ఇల్లూ...ఆఫీసూ... చాకిరీ...

వెంకటరావు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. చెంపల మీదుగా కారి చొక్కాపైన పడ్డాయి. కన్నీళ్ళు ఎంతకీ ఆగలేదు. కళ్ళల్లో నీళ్ళు చెలమల్లో వూరినట్లు ఊరుతున్నాయి. నిముషం. రెండు. మూడు. నాలుగు. పది నిముషాలు గడిచాయి. తన చొక్కాతోనే వెంకటరావు తన కళ్ళు తుడ్చుకున్నాడు. తనని తానే ఓదార్చుకున్నాడు. అరుగుమీదినించి నెమ్మదిగా లేచాడు. రొటీన్‌కి అలవాటుపడ్డ కాళ్లు ఇంటివేపు దారితీసాయి. వెంకటరావుని ఇంటికి ఈడ్చాయి. ఇంట్లో భార్య క్షయతో మంచంలో మూలుగుతూనే వుంది. పిల్లలిద్దరూ మంచందగ్గర గచ్చకాయలు ఆడుకుంటున్నారు. భార్యకి మందులు తేలేని లేమి, ఒకనాటి సాయంత్రం వెంకటరావులో తుఫాను రేపి మనిషిని ఒక ఊపు ఊపింది.

సాయంత్రానికల్లా, తుఫాను ఆగిపోయింది. మరుసటి రోజున తిరిగి వెంకటరావు ఇల్లూ, ఆఫీసూ, చాకిరీ, అనే రొటీన్‌లో లీనమైనాడు.

---

కథానిక

# జాబిల్లి నవ్వింది

"మంజుశ్రీ"

ప్రొద్దుటే బద్ధకంగా వొళ్ళువిరుచుకొని లేచి రాఘవరావు పెరటిలోకి వెళ్ళాడు. నీళ్ళ పొయ్యి రాజేస్తున్న జాబిల్లి రాఘవరావును చూసి నవ్వింది. రాఘవరావు కాశ్చర్యమేసింది. దొడ్లో వేప్పుల్ల విరుచుకొని నూతి చప్టా మీద కూచుని పళ్లుతోముకోవడం మొదలెట్టాడు. జాబిల్లి రాఘవరావు వైపు చూసింది. ఆ చూపులో ఎంతో కథ దాగివుంది. ఆ బరువైన రెప్పలక్రింద ఎన్నో సౌందర్యాలు తపస్సుచేసి కరిగిపోయినయ్. ఆ రెప్పలు రాఘవరావునుచూసి నునుసిగ్గుతో కదలాడినై. ఆ కళ్ళలోని ఎర్రజీరలు అతనిచూసి మెరిసినయ్. బుగ్గలుదాటి చెవులవరకు మందార పూల కాంతులు ప్రసరించినయ్. ఎందుకీ వగలు? ఏమిటా సిగ్గు?

అనుకున్నాడు రాఘవరావు. దంతావధాన కార్యక్రమాలు పూర్తి గావించి, బయటగదిలో కొచ్చి కూర్చుని రేడియో తిప్పడం మొదలెట్టాడు. బేటరీ అయిపోయింది గాబోలు ఖర్మ రేడియో సరిగాలేదు జాబిల్లి కాఫీకప్పుతో ప్రత్యక్షమైంది. కాఫీ అందుకుంటూ రాఘవరావు జాబిల్లి మొహం లోకి చూశాడు. జాబిల్లి మొహం బరువుగా కనపడ్డది. రాత్రంతా నిద్రలేనిదిలా కనపడ్డది. "ఏమిటో కథవుంది" అన్నాడు రాఘవరావు. జాబిల్లి నవ్వింది. "ఓ అమ్మాయీ, నీకు నవ్వటం తప్పితే ఇంకేమీ చేతగాదా? మాట్లాడటం చేతగాదా?" అని అడిగాడు రాఘవరావు. "కొంటె మాటలు మాట్లాడటం నాచేతగాదు." "మంచి మాటలు. ఎంతమంచివో చెప్పలేను. తియ్యటి మాటలు చెప్పనా?" అడిగింది జాబిల్లి. రాఘవరావు ఆశగా చూశాడు. మళ్ళీ జాబిల్లి కనుపాపల్లో సిగ్గు దొంతరలు కదలాడినై. బుగ్గలు ఎరుపెక్కినై. "పోండి నే చెప్పలేను" అనేసింది.

"అయితే కాగితం కలమూ ఇయ్యనా?"

"కార్డుముక్క వుంటే ఇయ్యండి."

"ఎందుకు?"

"పనుంది."

"ఏమిటాపని?"

"ఇక్కడ కూచుని మీతో మాట్లాడటానికి నాకు తీరికలేదు బాబో. మళ్ళీ మీరే కష్టపడతారు." జాబిల్లి త్వరత్వరగా వంటింట్లోకి నడిచింది.

కాఫీకప్పు ఖాళీచేసి 'జాబిల్లీ' అని కేకేశాడు రాఘవరావు. వంటింట్లోనుంచే "నేనురాను" అంది జాబిల్లి. మరి పిలవలేక కాఫీకప్పు చేత్తో తీసుకుని వంటయింట్లోకొచ్చాడు రాఘవరావు. కాఫీకప్పు నక్కడేవుంచి వంటింటి గడపమీద కూలబడ్డాడు. జాబిల్లి కూరగాయలు కోస్తున్నదల్లా రాఘవరావు వేపు తిరిగి నిండుగా నవ్వింది. రాఘవరావుకిదేమీ అర్థంకాలేదు. ఇవాళ ప్రొద్దుటినుంచీ జాబిల్లి నవ్వు దొంతరలలోనే మునిగిపోతున్నది. ఎక్కడన్నా నైట్రస్ ఆక్సైడ్ పీల్చిందేమో లేకపోతే ఇంత నవ్వేమిటి?

"ఎందుకలా వూరికే నవ్వుతున్నావు?" రాఘవరావు ప్రశ్నించాడు.

"అస్తమానం అన్నిసంగతులు మీకు చెబుతూ కూచోలేం సుమా. మీరుపోయి కాంపోజిషన్ బుక్స్ దిద్దుకోండి పోండి" అంది జాబిల్లి.

"నేనిక్కడ కూచుంటే నీకు కష్టంగా వుందా?"

"ఉండదూ. అలా గడపమీద ఎంతసేపని కూచుంటారు లేవండీ. ఎదురుగ్గా కూచోవాలనుకుంటే, అలా పీటచెక్క వాల్చుకుని కూచోండి" అంది జాబిల్లి.

రాఘవరావు లేచి బయటగదిలోకెళ్ళి ఏదో తీసి చదువుకోవడం మొదలెట్టాడు. తొమ్మిదిన్నర కాగానే భోజనానికి పిలుపొచ్చింది.

భోజనం చేస్తూ రాఘవరావన్నాడు. "ఇవాళ నువ్వు ఇంతగా ఎందుకు నవ్వుతున్నదీ నాకు తెలుసు."

"ఊఁ తెలుసు. ఏమిటి తెలుసో చెప్పండి?"

జాబిల్లి మంద్రస్థాయిలో అడిగింది.

"వెనకటి స్మృతులు గుర్తొచ్చి..."

"అంటే?"

"నేను మాట్లాడక పోవటం, నువు మాట్లాడాలని గుంజుకోవటం..."

"అబ్బ! పాపం! నేను మీతో మాట్లాడదామని గిలగిలలాడాను కదూ. లేకపోతే చచ్చిపొయ్యేదాన్ని...ఊఁ."

"లేదు జాబిల్లీ దొడ్లో పచ్చగన్నేరు చెట్టుకింద సాయం సమయాల్లో నువు కళ్ళు తుడుచుకోవటం ఎన్నిమాట్లు చూడలేదు? చప్పున ముందు వాలి దగ్గరకు తీసుకుని కన్నీళ్ళు తుడుద్దామనుకునేవాణ్ణి కానీ రాలేక పోయేవాణ్ణి."

"అంతా తెలిసి తెలిసి నన్ను యేడిపించారు గదూ?" జాబిల్లి దీనంగా అడిగింది.

"లేదు..."

"అవునండీ మీరు లేదనే అంటారు. నా గుండెల్లో యేడుపు యెవరికి వినపడుతుంది? నేనెవరికి చెప్పుకొని యేడ్చేది? మీరేం పలకనైనా పలకరు. మీకేం మహారాజులు. స్కూలూ, పిల్లలూ, స్నేహితులూ, నాతోనే పనేం. నాకెలా పొద్దు పోవాలి చెప్పండి లేచింది మొదలు పడుకునేదాకా వొక్కరూ నాతో పలకరైరి."

రాఘవరావు తలెత్తి జాలిగా జాబిల్లి కళ్ళలోకి చూశాడు.

"ఇదేమిటి పరధ్యాన్నంగా తింటే చిందరవందర చేస్తున్నారు, అన్నం వడ్డించనా. కొద్దిగా ఊఁ..." రాఘవరావు చేతులు కడుక్కుని గదిలో కొచ్చాడు చేతులు తుడుచుకుంటూ. జాబిల్లి వెనకనే వచ్చింది. వక్కపొడి చేతికందిస్తుండగా భుజాలు పట్టుకుని "ఇవాళ ఎందుకిలా నవ్వుతున్నదీ చెప్పందే నిన్ను వదలను", అన్నాడు రాఘవరావు.

"అయితే ఇవాళ స్కూలుకెందుకు సెలవ?"

రాఘవరావుకు నవ్వొచ్చింది. "అయితే నువు చెప్పవన్నమాట." "ఏమిటుంది చెప్పటానికి?"

"ఏమిటో వుంది?"

"అయితే మీరే చెప్పుకోండి చూదాం." అంది.

జాబిల్లి తలను హృదయానికి గాఢంగా హత్తుకొని "పో! మొండిపిల్లా చెప్పకుంటే సరే, సాయంకాలానికి చెవులు పిండి మరీ చెప్పిస్తా, స్కూలు టైమయింది." అన్నాడు రావఘరావు.

"గుంజీలు తీయించటం, గోడకుర్చీ వేయించటం చేయరుకదా? చెవులు పిండి చెప్పించటానికి నేనేం మీ స్కూలు పిల్లనా?" జాబిల్లి పగలబడినవ్వింది.

రాఘవరావుకూ నవ్వొచ్చింది. జాబిల్లి లోపలికెళ్ళిపోయింది. రాఘవరావు వాకిలి దాటుతుండగా వంటింట్లోంచి జాబిల్లి పిలిచింది. నడవలో చెప్పులు వదిలి చేతిలో పుస్తకాలతోటే రాఘవరావు వంటింట్లో కెళ్ళాడు.

"కార్డు కొత్త ఇచ్చిపోదురూ." అంది జాబిల్లి.

"ఎందుకు?"

"మా అమ్మకు వ్రాయాలి"

"ఇక్కడ నేనొక్క క్షణంకూడా వుండలేను. నన్ను చాలా కష్టపెడుతున్నారు. అసలు పలకటమే మానేశారు. కాబట్టి వెంటనేవచ్చి తీసుకెళ్ళాల్సింది. కాకపోతే ఇక నేనిక్కడవుండలేను. అని వ్రాస్తావు కదూ. నేనసలు నీకు కార్డు యియ్యను" అన్నాడు రాఘవరావు. జాబిల్లి భ్రుకుటిముడివడజేసి "అబ్బ మీరు మాట్లాడనప్పుడే ప్రాణం హాయిగావుంది. మీ కెలావుందో గాని" అంది. "అలా అయితే యీ పూటనుంచి మాటాడను జాబిల్లీ" అన్నాడు రాఘవరావు. "చూదాంగా పూటకూడా వుండలేరు." పెదవుల పైన చిరునవ్వు వెలుగుతుండగా జాబిల్లి అంది.

"మరయితే నన్నెందుకు పిలిచినట్లు?"

"నడిమిహాల్లో మంచంమీద కార్డూ కలమూ వుంచి పొండి. అందుకే మిమ్మల్ని పిలిచాను"అంది జాబిల్లి. రాఘవరావు అలానేచేసి స్కూలుకెళ్ళి పోయాడు. సాయంత్రం స్కూలునుంచి రాగానే:

"కార్డిలాతే పోష్టాఫీసు కెళ్లోస్తాను జాబిల్లీ." అన్నాడు రాఘవరావు. "అయ్యో పాపం, అంత శ్రమ తీసుకోనవసరంలేదు లెండి. మీ కార్డు మీరే తీసుకోండి. పెట్టెలోంచి కవరుతీసి, ఉత్తరంవ్రాసి కృష్ణ మధ్యాహ్నం బడికెళ్ళేటప్పుడు వాడి చేతి కిచ్చి పోస్టు చేయించాను లెండి" అంది జాబిల్లి.

"ఏం రాశావో నే చూడకుండానే!"అన్నాడు రాఘవరావు.

జాబిల్లి నవ్వింది. రాఘవరావు చిరాకు నభినయిస్తూ, గద్దిస్తూ "ఎందుకింతనవ్వు? ఎవర్నిచూసి" అన్నాడు. జాబిల్లి వణికిపోయినట్లు నటించి.

"తప్పైంది మేష్టారూ, ఈసారికి ఎక్స్క్యూజ్ మీ, చెంపలేసు కుంటున్నాను" అంది.

రాఘవరావు నవ్వాడు. దగ్గరకు లాక్కుని "అయితే చెప్పవుకదూ!" అన్నాడు.

"అమ్మ పదిరోజుల్లో వస్తుంది. అంతా తెలుస్తుంది లెండి" అంది జాబిల్లి.

"నామీద కోపమేం రాలేదుగద!" అన్నాడు రాఘవరావు.

"ఎందుకు!" జాబిల్లి గోముగా అడిగింది.

పదిరోజుల్లో రాఘవరావు అత్తగారు దిగింది. సరాసరి యింట్లోకొచ్చి నడిమిహాల్లో కూచున్న కూతురికేసి తేరిపారజూసి"ఎన్నో నెలమ్మా!"అంది. దానికి సమాధానంగా జాబిల్లి రాఘవరావు వేపుచూసి నవ్వింది. రాఘవరావు కర్థమైంది."ఇందుకా యీ సిగ్గు. ఇందుకా ఇంత కథ" అనుకున్నాడు.

రాఘవరావు జాబిల్లి వేపు చూశాడు. ఆ చూపుల్లో "తెలిసిందిలే నీ కథ" అనే భావంవుంది.

జాబిల్లి సిగ్గుపడనూలేదు, తలవంచనూలేదు. నవ్వింది. అంతే. జాబిల్లి నవ్వింది. ★

---

గేయం

# ఏమందువు?

సంపత్కుమార

శతాబ్దాల లోతులలో
ని తమస్సుల గుండెలలో
దాగిన చిరువెల్గుల దిగ
దావిన ఈ నిమిషంలో
కన్నులలో కుహూరాత్రు
లున్నవన్న తొలిగెదవా?

విధానాల అల్లికలో
ని ధనప్రత్యేకతలో
చిక్కనట్టి బ్రతుకుల చెడ
చీల్చిన ఈసమయంలో
మేధ చిటిలి చిందులుగా
బాధపొంది కలిగెదవా?

నిరంతాబ్ధి వలయంలో
ని రహస్యపు లోతులలో
తొలగునీటి ఎడదల పడ
ద్రోసెడి ఈ అదనులలో
కాళ్లు మడతపడి పోయిన
జోళ్లుచూచి వాడెదవా?

విశాలాభ్ర వీధులలో
ని శతత్వప్రక్రియలో
గుండెలురలి పోవుచు పరు
గుల్లు పెట్టు వేళలలో
నేలనుండి కిల లుబికి
కాలిపోవ మాడెదవా?